క్లుప్తంగా

పాఠశాల యాజమాన్యంపై కాంగ్రెస్ ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న శ్రీవాణి విద్యాలయం యాజమాన్యంపై శనివారం ఫైర్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై పెట్రోల్ బంక్‌కు కేవలం 30 మీటర్ల దూరంలో శ్రీవాణి విద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధులు మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు మున్సిపల్ పాలకవర్గం హర్షం వ్యక్తం చేసింది. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, పట్టణంలోని పలు జంక్షన్ల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.20 కోట్లు మంజూరు చేశారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, పాలకవర్గ సభ్యులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినిదేవి, రమాదేవి, స్వర్ణలత, చిత్తారి పద్మ, మ్యాదరబోయిన శ్రీనివాస్, కల్పన, వల్లపు రాజు, వాల సుప్రజ, కో ఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్ రెడ్డి, అయూబ్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం



చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మల్లేశం

దుబ్బాక రూరల్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నాగరిగారి ప్రీతంను నియమించినందుకు దుబ్బాక మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇస్తారిగల్ల మల్లేశం శనివారం హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. ప్రీతంను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో పరిశుభ్రత పాటించండి, రోగాలను తరిమికొట్టండి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి, బహిరంగ ప్రదేశాల్లో చెత్తపారబోయొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కో ఆప్షన్ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదికి పరామర్శ

సిద్దిపేటకమాన్: ఇటీవల న్యాయవాది రవికుమార్ పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు శనివారం ఆయనను పరామర్శించారు. న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. పరామర్శించినవారిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, సభ్యులు సత్యనారాయణ, సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు జనార్దన్‌రెడ్డి, మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు హరిశ్చంద్ర, సాయిబాబ తదితరులు ఉన్నారు.

ముస్తాబైన ఆలయం

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం ఆషాఢ బోనాల ఉత్సవాలకు నల్లపోచమ్మ ఆలయం ముస్తాబైంది. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం పూజా కార్యక్రమాలతో పాటు బోనాల ఊరేగింపు ఉంటుందని సంఘం సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

అసంపూర్తి నిర్మాణాలు

మండలంలో అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఏడాది దాటుతున్నా వాటిని పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. పరిపాలన సవ్యంగా సాగేందుకు గ్రామాల్లో కొత్త పంచాయతీ భవనాలకు శ్రీకారం చుట్టారు. అలాగే కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు గ్రామాల్లో ఫంక్షన్‌హాల్స్ నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటి వరకు వాటిని పూర్తి చేయకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- ఏడాది గడుస్తున్నా పూర్తికాని వైనం
- పట్టించుకోని అధికారులు
- మండిపడుతున్న ప్రజలు
- చర్యలు చేపట్టాలని డిమాండ్



రాయవరంలో నిలిచిపోయిన పంచాయతీ భవనం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొత్తగా పంచాయతీలు ఏర్పడటంతో గత ప్రభుత్వం నూతన పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసింది. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.22 నుంచి 40 లక్షల వరకు కేటాయించారు. ఎన్నికలకు ముందే పలుగుగడ్డ, వట్టిపల్లి, బస్వాపూర్, అనంతసాగర్, చిన్నకిష్టాపూర్, ఇటిక్యాల, పిటి వెంకటాపూర్, జంగంరెడ్డిపల్లి, నిర్మల్ నగర్, ఎల్లాయిగూడ గ్రామాల్లో పూర్తి చేసి ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో పూర్తి కాకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తిగుల్‌నర్సాపూర్, అలిరాజ్‌పేట, తిమ్మాపూర్, కొండాపూర్, మందాపూర్ గ్రామాల్లో చివరి దశలో ఉన్నా బిల్లులు విడుదల కాలేదని సదరు కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తపేట, రాయవరం గ్రామాల్లో పిల్లర్ల దశలో ఉండగా భూ సమస్య తెరపైకి రావడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు.

నత్తనడకన సాగుతున్న పనులు

మండలంలోని చాలా గ్రామాల్లో ఫంక్షన్‌హాల్స్ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. జగదేవ్‌పూర్, వట్టిపల్లి, చిన్నకిష్టాపూర్, గొల్లపల్లి, ఇటిక్యాల గ్రామాల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతా గ్రామాల్లో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. భోజనశాలల నిర్మాణాలు కొన్ని గ్రామాల్లో ప్రారంభించలేదు. బస్వాపూర్, తిగుల్, తిమ్మాపూర్, అలిరాజ్‌పేట, ధర్మారం, చాట్లపల్లి, తిగుల్ నర్సాపూర్ గ్రామాల్లో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు చెబుతున్నారు. వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం

మండలంలోని కొన్ని గ్రామాల్లో పంచాయతీ భవనాలు, ఫంక్షన్‌హాల్స్ నిర్మాణాల్లో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. కొన్ని గ్రామాల్లో పంచాయతీ భవనాలు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేస్తాం.

– దేవయ్య, పీఆర్, ఏఈ, జగదేవ్‌పూర్

శిథిల వంతెనతో ఇక్కట్లు



ఇనుప చువ్వలు తెలిన వంతెన

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానా అవస్థలుపడుతున్నారు. 25 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన ఇనుప చువ్వలు తెలి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో వంతెనపై పడిన గుంతల్లో పడి వాహనదారులు గాయపడ్డారని అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండాపోయిందని పరిసర గ్రామాల ప్రజలు విచారం వ్యక్తం చేశారు. ఈ వంతెన గుండా కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారికి వెళ్లేందుకు కోహెడ, చిగురుమామడి, బెజ్జంకి మండల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీఎస్సీ అభ్యర్థులపై లాఠీచార్జి తగదు

కోహెడరూరల్(హుస్నాబాద్): డీఎస్సీ పరీక్ష నిర్వహణకు మరికొంత సమయం ఇవ్వాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీలో 11 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి, ఆపై అరెస్ట్ చేయడం తగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మహామైసమ్మకు విశేష పూజలు



మహామైసమ్మ అమ్మవారు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా సిద్దిపేటలోని ప్రశాంత్ నగర్ శ్రీ మహామైసమ్మ దేవాలయంలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి గాజులతో అలంకరించారు. పంచామృత అభిషేకం, ఫలాభిషేకం, కలశపూజలు చేశారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు చెల్లించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు తరలి రావడంతో ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం పట్నాలు, బోనాల జాతర ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

పోచమ్మ తల్లికి ఆషాఢ బోనాలు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మందపల్లి గ్రామస్తులు శనివారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా గ్రామ దేవతలకు బోనాల పండుగ చేయడం ఆనవాయితీగా వస్తోంది. డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాల్వ వద్దని రైతుల దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న ఆయా గ్రామాల రైతులు

నర్సాపూర్: సంగారెడ్డి రీచ్–2 కాల్వ వద్దంటూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండవ రోజుకి చేరాయి. కొండ పోచమ్మ కాల్వ వద్దు, సెమి అర్బన్ ముద్దు నినాదంతో రైతులు నర్సాపూర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. సంగారెడ్డి కాల్వ ఏర్పాటు చేసే గ్రామాలకు చెందిన రైతులు మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కిష్టాగౌడ్, కొమురమ్మ, మల్లమ్మ, రాంకిషన్, కొండల్, యాదాగౌడ్ తదితరులు రిలే దీక్షల్లో పాల్గొన్నారు.

కులసంఘం ఏర్పాటుకు సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట వైశ్యకుల సంఘం ఏర్పాటుకు ఆదివారం పట్టణంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు సన్నాహక సంఘం ప్రతినిధులు రాజు, వెంకటేశం తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో వైశ్య సోదరులతో కుల సంఘం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని అయ్యప్ప టెంపుల్ సమీప ఫాంహౌస్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సురేష్ కాసనగొట్టు రవి, పప్పు రవి, వెంకటరమణ, దామోదర్, విఠల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. చిన్నకోడూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మ కనకరాజు (35) కిరాణాషాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యాపారం లేకపోవడంతో అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక ఈనెల 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లాడు. గడ్డి మందు తాగి భార్యకు ఫోన్ చేసి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పడంతో ఆమె తన ఆడపడుచు రజితకు ఫోన్ చేసి విషయం తెలిపింది. దీంతో కనకరాజుకు రజిత ఫోన్‌చేయగా చేసిన అప్పులు తీర్చే మార్గం లేక చనిపోతున్నానని చెప్పాడు. కుటుంబ సభ్యులు నిమ్స్‌కు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోహెడరూరల్(హుస్నాబాద్): సీఎం రిలీఫ్ ఫండ్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. మండలంలోని శ్రీరాములపల్లి, నకిరేకొమ్ముల, పరివేద గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది శంకర్, యూత్ మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో..

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన పలువురి లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల రూపంలో మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య తెలిపారు. ఖమ్మం సత్యనారాయణకు రూ.22,500, రాగటి బాబు రూ.11,500, ఖమ్మం రేణుక రూ.11,000, నక్క లచ్చవ్వ రూ.8,500 మంజూరయ్యాయి. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, సుధాకర్, మల్లారెడ్డి, లక్ష్మణ్, అశోక్, శ్రీనివాస్, సుధాకర్, వెంకటస్వామి, బాలకిషన్, స్వామి, ప్రకాశ్ పాల్గొన్నారు.

అక్కన్నపేటలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద చెక్కులను విడుదల చేసింది. వాటిని శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.6,68,000 విలువ గల చెక్కులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బుర్ర ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, నాయకులు పత్తిపాక త్రిమూర్తి, భూక్య వీరన్న, చొక్కం గణేష్, పంగ రాకేష్, పర్శరాములు, స్వామి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ మండలంలో..

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. పందిల్ల, కూచనపెల్లి, పొట్లపల్లి, గాంధీనగర్, పోతారం(ఎస్), జిల్లెలగడ్డ, మహ్మదాపూర్ గ్రామాలకు చెందిన 14 మందికి రూ.3.50 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెన్నె రాజు, బొంగొని శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.



పరివెదలో చెక్కు అందజేస్తున్న ధర్మయ్య

వర్షాలు సమృద్ధిగా కురవాలి

- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సిరి సంపదలతో తులతూగాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఆకాంక్షించారు. శనివారం పట్టణంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న బోనాల పండుగలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమ్మవారి దయతో వానలు కురవాలని కోరుకున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా మహాపూజ, చండీ హోమం, శ్రీలలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాలు జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల–చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల లెక్చరర్లు, టీచర్లు బదిలీ అయ్యారు. బదిలీ అయిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు, టీచర్లు దయాకర్, కృష్ణమూర్తి, వెంకటరమణ, తిరుపతిరెడ్డి, గణేశ్, సునీత, ప్రవల్లికలను శనివారం ఇంటర్ విద్యార్థులు సన్మానించి వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన నూతన ప్రిన్సిపాల్ రఘునందన్‌కు విద్యార్థులు స్వాగతం పలికారు.

వృథాగా ప్రభుత్వ భవనాలు

మద్దూరు(హుస్నాబాద్): పక్కా భవనాలు లేని కొన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, కొన్నిచోట్ల ఉన్న భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నిర్మించిన హౌసింగ్‌బోర్డు, పాత ఎంపీడీఓ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరాయి. అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లో అద్దె భవనాల్లో కొనసాగతున్న కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న హౌసింగ్ బోర్డు శాఖ కార్యాలయం

సంక్షిప్త వార్తలు

◆ రాజకీయ ఉనికి కోసమే ఆరోపణలు

చేర్యాల(సిద్దిపేట): రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కొమ్మూరి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కి మద్దతుగా ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతున్నాడని, తన వైఖరి మార్చుకోవాలన్నారు. కొమ్మూరిపై చేసిన ఆరోపణలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాలపై ఆధారాలు ఉంటే నిరూపించాలన్నారు. సమావేశంలో కొమురవెల్లి మండలం ఐనాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ నేడు మహంకాళి బోనాల జాతర

మిరుదొడ్డి(దుబ్బాక): ఆషాఢ మాసం సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మిరుదొడ్డిలోని మహంకాళి అమ్మవారికి బోనాల జాతర నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కొమ్మెర భగవంతరెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారికి అభిషేకాలు, మంగళహారతులు, సామూహిక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు తోట అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, అంజిరెడ్డి, నర్సింహారెడ్డి, సదానందరెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



◆ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరిగారి ప్రీతంను శనివారం హైదరాబాద్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆ పార్టీ నాయకుడు పుట్ల ఏసు తెలిపారు. ఆయనను శాలువాతో సన్మానించినట్లు పేర్కొన్నారు. ప్రీతంను కలిసిన వారిలో పార్టీ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్ ఉన్నట్లు తెలిపారు.

◆ క్రీడాకారుల అభివృద్ధికి కృషి

దుబ్బాక: క్రీడాకారుల అభివృద్ధికి కృషిచేస్తానని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నట్లు దుబ్బాక మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. శనివారం ఆయనను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి దుబ్బాకలో మినీస్టేడియం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన స్పందించి నైపుణ్యం ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. శివసేనారెడ్డిని కలిసినవారిలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తేజ, అన్వర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థినికి చేయూత

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ హైస్కూల్ విద్యార్థిని పబ్బోజు రక్షిత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు శనివారం దుద్దెడ ఉద్యోగుల వెల్‌ఫేర్ అసోసియేషన్ (దేవా) సభ్యులు రూ.10,500 నగదు ప్రోత్సాహక బహుమతి అందజేసి సత్కరించారు. అలాగే కుకునూరుపల్లి మండల విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న దుద్దెడకు చెందిన తాళ్ళ రాజేంద్రప్రసాద్ రూ.2 వేలు అందజేశారు. ఈ సందర్భంగా దేవా అధ్యక్షుడు బొజ్జ రాజు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకారాదన్నారు. అనంతరం ఉపాధ్యాయ పదోన్నతులు పొందిన పొన్నం శ్రీనివాస్, గున్నాల శ్రీనివాస్‌లను దేవా సభ్యులు సన్మానించారు.

◆ డీజీపీకి శుభాకాంక్షలు

మద్దూరు(హుస్నాబాద్): డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల మహేశ్‌గౌడ్ తెలిపారు. ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. శాంతి భద్రతలను నెలకొల్పాలని మహేశ్ ఆకాంక్షించారు.

